కాంప్లిమెంటరీ టిక్కెట్టు

జోగారావూ శ్యామలాంబా పార్కునుంచి తిరిగొచ్చి తలుపు తెరిచే టప్పటికి ఎదురుగా నేలమీద తెల్లటి కవరొకటి కనపడింది.

"ఎవరు రాశారు?" అంది శ్యామలాంబ.

"ఉత్తరం కాదు, కాంప్లిమెంటరీ టిక్కెట్టు" అన్నాడు జోగారావు.

"కాంప్లిమెంటరీ టిక్కెట్టా? అంటే?"

"డబ్బిచ్చి టిక్కెట్టు కొనుక్కుని కాకుండా ఉచితంగా సినిమా చూడటానికని, కొందరికి ఇలాంటి ప్యాసులు పంపుతారులే."

"సినిమావా? ఏం సినిమా అండీ?"

"గాజుల పిల్లట."

"ఇలే! ఇక నేం? ఈ సినిమాకి రేపో యెప్పుడో 'తీసుకెళ్ళండీ' అని అడుగుదామని అనుకుంటున్నాను కూడాను. సమయానికే వచ్చింది ప్యాసు."

"ఎవరు పంపించారంటావ్?"

"ఎవరు పంపిస్తారు? మా అన్నయ్యే పంపించి ఉంటాడు."

"మీ అన్నయ్యా? పోస్టాఫీసులో గుమాస్తాపని చేసే మీ అన్నయ్యకీ, ఈ 'గాజులపిల్ల'కీ ఉన్న సంబంధం యేమిటి?"

"చాల్లెద్దురూ మీరూ మీ వ్యంగ్యమాటలూనూ! కార్డులు కొనుక్కోటానికనీ, బంగీలు పంపటానికనీ, మనియార్డర్లు కట్టడానికనీ ఎందరు వెళ్ళరు పోస్టాఫీసుకి? మావాడు మీకుమల్లే ఓమూల ముంగిలా కూచునేరకం మనిషి కాడు. కలిసికట్టుగా ఉండి, పెద్దవాళ్ళందరితోటి పరిచయం సంపాదించిన వాడు, ఏమనుకున్నారో!"

"ఐతే ఈ సినిమావాళ్లు కార్డులు కొనుక్కోటానికొచ్చి, మీ వాణ్ణి చూడటంతోనే చేయ్ చేయ్ కలిపి, భాయ్‌సాయ్ అంటూ ప్రాణస్నేహితులై, 'ఇంత కన్నా యెవరికిస్తాం ఈ కాంప్లిమెంటరీ టిక్కెట్లు?' అనుకుని, మీ వాడిచేతిలో ఒకటి పడేసి ఉంటారంటావ్?"

"ఔను"

"ఐతే. ఈ టిక్కెట్టుతో, తనూ తన భార్యా సినిమాకి వెళ్లక, మనకెందుకు పంపిస్తాడు? అంత త్యాగం, ఔదార్యం ఉండా మీఅన్నకి?"

"ఎందుకు లేదు? ఆమాటకొస్తే, ఔదార్యానికి మా అన్నతో ఎవరూ పోలరు ఏ పండుగకి నన్ను పిలవటం మానేశాడు చెప్పండి? మీకుమల్లే ననుకున్నారా ఏమిటి మావాళ్ళు?"

"నామాట తీసుకొస్తావెందుకూ సందర్భంలేకుండా? మా చెల్లెల్ని నేను తీసుకు రాక ఊరుకోవటానికి కారణం ఎవర్లో తెలుస్తూనే ఉంది."

"ఏమిటి తెలుస్తూనేఉంది? నేను మీ చెల్లెల్ని తీసుకురావద్దన్నానా? అనవసరంగా నామీద విరుచుకు పడతారెందుకూ? మీకూ మీకూ అన్యోన్యాలు అలా అఘోరించాయి. మధ్య నేనేం చేశాను? మీరా నాకు..."

ఆ కాంప్లిమెంటరీ టిక్కెట్టు ధర్మమాఅంటూ, ఆ భార్యాభర్తల నడుమ ఇలా తుపాను ప్రారంభమైంది. పక్కింటి కామేశ్వరమ్మగారు ఆవేళకు అక్కడికి "ఐదురూపాయిలనోటుకు విడిరూపాయిలున్నాయా?" అంటూ రావటం మూలాన్ని ఆ తుపాను ఆగిపోయిందేగాని లేకపోతే ఏ విధంగా చెలరేగి ఉండేదో మరి? కామేశ్వరమ్మగారు వచ్చి, తమ పేచీ అడ్డిపోయినందుకు జోగారావు మాత్రం సంతోషించాడు. మళ్లీ ఆ సందర్భంలో తగువు రాకూడదని నిశ్చయించుకున్నాడు కూడాను. కాని శ్యామలాంబకు మట్టుకు అక్కసు తీరలేదు. చిల్లరనోట్లు పుచ్చుకుని వెడుతూన్న కామేశ్వరమ్మగారితో ఆమె, "ఏమండీ, రేపు 'గాజులపిల్ల' సినిమాకు వెడుతున్నాం. మా బావగారు ఫ్రీ టిక్కెట్టు పంపించారు!" అంది. ఈ మాటలు జోగారావుకు వినపడాలనే ఆమె గట్టిగా అంది. కామేశ్వరమ్మ "మీకు బావగారున్నారా? నాకు తెలియదాసంగతి. ఏంపని వారికి? ఈ పట్నంలోనే ఉన్నారా వారు?" అంటూ ప్రశ్నపై ప్రశ్న కురిపించింది. కాని సమాధానం రాకుండానే. రూపాయలకోసం కనిపెట్టుకుని ఉన్న

ఆవిడ భర్త 'రమ్మ'ని పిలవటం చూసి ఆమె వెళ్ళిపోవలసొచ్చింది. జోగారావుకి అన్నలెవరూ లేనేలేరు. శ్యామలాంబ పక్కింటావిడతో అనవసరంగా ఫ్రీ టిక్కెట్టుమాట తెచ్చి, "మా బావగారు పంపించా"రంటూ తన్ను వెటకారం చెయ్యటంలో అతనికి పుండుమీద కారం రాసినట్లయింది. ఐతేం? తన్ను కానట్లు ఊరుకున్నాడు. ఆ ఊరుకోడం, ఏమంటాడో చూదామనుకుంటూ లోపలికొచ్చిన శ్యామలాంబకు ఆశాభంగమే అయింది.

మర్నాడు జోగారావు బయటకు పోగా చూసి, శ్యామలాంబ డ్రాయరులోంచి ఆ కాంప్లిమెంటరీ టిక్కెట్టు తీసి పరిశీలించింది. "జూన్ పన్నెండో తారీఖున ఆరుంపావు ఆటకు" అని వుంది అందులో. పన్నెండంటే ఆ రోజునే. ఆవేళ వెళ్ళాలన్నమాట.

జోగారావు భోజనంచేసి ఆఫీసుకు వెడుతోంటే ఆమె, "ఏమండీ, ఒక గంటముందుగా వస్తారుకదూ సాయంత్రం?" అంది.

"ఎందుకు?"

"మరిచిపోయినట్లు మాట్లాడుతారేమండీ? సినిమాకు వెళ్ళొద్దూ మరి?"

"మీ అన్నయ్య కాంప్లిమెంటరీ టిక్కెట్టు పంపినాడు కదా అని. నాకు ఆఫీసువాళ్ళు గంట సెలవిస్తారా?"

"నిన్నరాత్రి కోపం ఇంకా పోలేదన్నమాట మీకు. సినిమాకని కాకుండా ఏదో పనుందని అడిగితే ఆఫీసువాళ్లుమాత్రం వొద్దంటారుటండీ!"

"వొద్దంటారనేకాదు. ఎక్కడో తిరువళిక్కేణిలో ఆడుతోంది. ఆ "గాజులపిల్ల" రాత్రి పదిగంటలైపోతుంది. మాంబళానికి బస్సు దొరుకుతుందో దొరకదో?"

"టిక్కెట్టు తేరగావస్తే మీ కన్నీ అభ్యంతరాలే కనపడతాయి. ఇదివరకు ఎన్నిమాట్లు సినిమాలకు వెళ్ళలేదు? అప్పుడు దొరికిన బస్సులు ఇప్పుడు దొరక్కపోతాయేమిటి? అంతగా దొరక్కపోతే గుర్రబ్బండి కట్టించుకుందాం. టిక్కెట్టు కొనక్కర్లేదుగా? ఆసొమ్ము ఇలా పెడితేసరి"

ఇంక ఆట్టే బతిమాలించుకోకూడ దనిపించి, జోగారావు "సరే ఐతే నేను ఇంటికొచ్చేవేళకు చీర సింగారించి సిద్ధంగా ఉండు" అని చెప్పి ఆఫీసుకు వెళ్ళాడు.

వాళ్లు ఇదివరకు ఎప్పుడు సినిమాకు వెళ్లినా తొమ్మిదణాలకుమించి టిక్కెట్టు కొనేవారుకాదు. వాళ్లీనాడు ఫస్టుక్లాసులో మెత్తలున్న సోఫాలలో కూర్చుని చూడటం శ్యామలాంబకి సరదాగానే ఉంది. పెద్దపెద్ద ఆఫీసర్ల భార్యలతో సమంగా డ్రింకులూ, చాక్లెట్లూ, బిస్కత్తులూ కొనాలనిపించింది. "టిక్కెట్టు ఖర్చు లేదుగా? ఆ సొమ్ము దర్జాగా ఖర్చుపెడదాం" అనిపించిందామెకు "టిక్కెట్టు ఖర్చు లేకపోతేం? తక్కిన బిల్లంతా తడిసి మోపెడౌతోంది జాగ్రత్త!" అని జోగారావు మెల్లిగా సణిగాడు. "ఫరవా లేదండీ. ఇప్పుడే ఏ సరదా తీరినా. పిల్లలు బయల్దేరాక వాళ్ళకు సంకెళ్లే. అప్పుడు ఇంకెక్కడికి వెళదామన్నా వీలే ఉండదు" అన్నది.

జోగారావుకు "గాజులపిల్ల" కథ ఏమీ నచ్చలేదు. ఒక్క సందర్భం కూడా సహజంగా కనపడలేదతనికి. "ఎందుకు తీసినట్టు ఈ ఫిలుము?" అన్నాడు. మూడుగంటల ఫిలుమది. రెండుగంటలయ్యాక "పోదాంపద. తల నొప్పిగా ఉంది!" అన్నాడు. ఆవిడ ససేమిరా వప్పుకోలేదు.

ఆట అయిపోయిందిగాని "కాంప్లిమెంటరీ టిక్కెట్టు ఎవరు పంపించారు?" అన్న ప్రశ్నమాత్రం మిగిలిపోయింది. ఆ పంపిన స్నేహితుడెవడో సినిమా హాలువద్ద కనపడి, తమ థ్యాంక్సు అందుకు వెడతాడని వాళ్ళనుకున్నారు. గాని అలా ఎవడూ వచ్చి కనపడలేదు. "ఐతే ఎవరు పంపించి ఉంటారండీ?" అంది శ్యామలాంబ. అతడు చిరాగ్గా, "ఎవడైతేం, నాపాలిట శనిగాడు! తొరగా అడుగువెయ్యి. అవతల బస్సు దొరక్కపోతే ఇంకా ఆముదం ఐపోతుంది!" అని చురుగ్గా నడిచాడు. ఆమె మాట్లాడకుండా అతని వెనక పరుగెత్తింది.

త్యాగరాయనగరులో బస్సుదిగి తమవీధి ప్రవేశించేవరకూ ఆమె మళ్లీ మాట్లాడనేలేదు. వెళ్లిన తక్షణం బస్సు దొరికిందిగనక, ఇంక పేచీ రాదనిపించింది. "ఏమండీ శనిగాడనేశారు! ఇలాగేనా కృతజ్ఞత చూపటం?" అంది మెల్లిగా. అతడేదో బదులు చెప్పబోతూంటే, వీధిలో తమ ఇంటిప్రాంతంలోనే జనంగుమిగూడి ఏదో గలభా జరుగుతూన్నట్లనిపించింది. వాళ్లిద్దరూ చురుగ్గా అడుగువేసి, తమ ఇంటిముందే చేరిన ఆ గుంపుని "ఏమిటి?" అని అడిగారు.

"ఏముంది, మీరు సినిమాకు వెళ్లగా చూసి, మీ యింట దొంగలు పడ్డారు. నే నెక్కడో వంటింట్లో పిల్లలకు అన్నాలు పెడుతున్నానేమో, మీ యింట వాళ్ళు ప్రవేశించిన అలికిడి తెలిసిందికాదు. సమయానికి మీ

పినమామగారు దేవుళ్లలాగ రైలుదిగి వచ్చారుగాని, లేకపోతే వాళ్లు అంతా దోచుకుపోయేవారు !" అంది కామేశ్వరమ్మగారు. శ్యామలాంబ గుండెం కమక్కుమంటో లోపలికి పరుగెత్తింది. బీరువాల తలుపులు బార్లా తెరిచివుంచి, ఆమె సిల్కుచీరలన్నీ బొత్తుం బొత్తులుగా బయటపడి ఉన్నాయి. వెండి సామానుల మానుపెట్టె మూత తెరిచి ఉండి, కంచాలూ గిన్నెలూ నేలమీద పడేసి ఉన్నాయి. డ్రాయరుల్లో సొరుగులాగి ఉంచటం చూసి జోగారావు పరుగెత్తికెళ్లి అందులో తాను భద్రపరిచిన కరెన్సీనోట్ల బొత్తి కనపడక పోవటంతోనే 'గతుక్కు'మన్నాడు. గుమ్మంలో కాపలా కాస్తూ కూచున్న అతని పినతండ్రి వెంకట్రామయ్యగారు, "ఇవిగోరా నోట్లు. వాళ్ళని పోలీసుస్టేషనుకు తీసుకుపోయేటంతవరకూ నాకు వాళ్ల జేబులు సోదాచెయ్యాలని తోచిందేకాదు. వెళ్లేముందు తడిమిచూస్తినిగదా ఒకడి జేబులో ఈ బొత్తీ, రెండోవాడి జేబులో ఈ టిక్కెట్లూ దొరికాయి" అంటూ యిచ్చాడు.

"టిక్కెట్లేమి"టంటూ చూశాడు జోగారావు. తమకు వచ్చిన కాంప్లిమెంటరీ టిక్కెట్టుకుమల్లేనే ఉన్నాయి అవన్నీ! శ్యామలాంబతో, "మనకి టిక్కెట్టు మీ పోస్టాఫీసు అన్నయ్య పంపాడనుకున్నావు! దాన్ని పంపుత మనం యెరగని యీ కొత్తఅన్నయ్యలు!" అన్నాడు. "దొంగ వెధవల్ని మా అన్నయ్యలనటం న్యాయంకాదు" అంటూ ఆమె నిజంగానే చిన్నపుచ్చుకుంది. "వాళ్లిద్దర్నీ చూచినవాళ్ళెవరూ దొంగలనుకోరు తెలుసా? ఇంతక్రితమే పోలీసువాళ్ళొచ్చి తీసుకుపొయ్యారుగాని, వాళ్ళెంత పెద్ద మనుషులులాగ కనపడుతున్నారో నీకేం తెలుసును? ఆ సెట్టూరు మల్లు పట్టులూ, ఆ జరీకండువాలూ చూసి నేనే దగాపడిపొయ్యాను. ఏంజరిగిందో తెలుసా? నేను సరిగ్గా ఎనిమిది గంటలకు వీధిలో బండిదిగి, 'అబ్బాయ్' అంటూ గుమ్మం యెక్కాను. లోపల దీపాలు కనపడుతూనే ఉన్నాయి. వాళ్ళలో ఒకడు చేరవేసిన తలుపు తెరచుకువచ్చి, "ఎవరు కావాలండీ మీకు?" అని అడిగాడు. నేను ఆ కొత్తమొగంచూసి, "మా జోగారావు లేడా?" అన్నాను. "వారు నిన్ననే ఈ ఇల్లు ఖాళీచేసి మరోచోటికి వెళ్లిపోయారండీ. మేం కొత్తగా ప్రవేశించాం" అన్నాడు. "ఎక్కడికి మార్చేరుబాబూ?" అంటే, తడుముకోకుండా "చిన్నప్పన్ వీధి, తిరు

వళిక్కేణి, నెంబరు 23" అన్నాడు. నేనా అడ్రసు రాసుకుని, సంచీ చేతపుచ్చుకుని తిరుగుదారి బట్టాను. కామేశ్వరమ్మగారి భర్త ఎదురై, "ఏమండోయ్ ఎప్పుడొచ్చారు ?" అని పలకరించాడు. "ఏడున్నర గంటల ప్యాసింజరులో వచ్చానండి. మానాడు ఇల్లు మార్చేశాడుటగా ?" అన్నాను. ఆయన నిర్ఘాంతపోయి, "ఇల్లు మార్చటమేమిటి ? ఐదు గంటలకి ఆయనా, భార్యా తాళంవేసుకు వెడుతూంటే చూశానే ? సినిమాకు వెడుతున్నారంది మా ఆవిడ." అన్నాడు. దానితో నాకు అనుమానంవేసి, క్షణంలో ఇంట్లో ఉన్న మనుషులమాట చెప్పి, ఆయన్నీ ఆయన తమ్ముణ్ణి వాళ్ల బంట్రోతుల్నీ వెంటబెట్టుకుని మళ్ళీ మీ గుమ్మం యెక్కాం. "ఎవరయ్యా మీరు ?" అని ఆయన గద్దించి అడగటం, వాళ్లిద్దరూ నీళ్ళు నములుతూ పారిపోవటానికి సిద్ధపడటం, మేం పైనపడి పట్టుకోవటం అంతా ఒక్క క్షణంలో జరిగిందనుకో... వాళ్ళు మీకీ టికెట్టు పంపి బాగానే వేశారు. మద్రాసు టోప్పీ ! ఎటొచ్చీ తలవని తలంపుగా నేను దిగి వాళ్ళ ప్లానుకు అడ్డురావటం జరిగింది" అన్నాడు వెంకట్రామయ్యగారు.